విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 04 ఫిబ్రవరి 2024 8 పేజీలు

స్థాన చలనంతో విజయం వరిస్తుందా!

- ముఖ్యమంత్రి జగన్ నమ్మకం ఏంటి
- అన్ని చోట్ల వలస నేతలే
- పెండింగ్‌లో ఒంగోలు ఎంపీ అభ్యర్థి
- వలస నేతలను తెచ్చే అవకాశం
- తప్పక ఇబ్బంది పడుతున్న నాయకులు
- ఇక్కడ చెత్త అక్కడ పనికొస్తుందా.. అంటున్న ప్రతిపక్షాలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఎత్తుగడలు అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. నా నియోజకవర్గం అంటూ అంటిపెట్టుకొని 20 ఏళ్లుగా 30 ఏళ్లుగా కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నాయకులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ నియోజకవర్గాలు వీడి పక్క నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2014, 2019 ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పోటీచేసి విజయం సాధించిన నాయకులు లేదా పోటీ చేసి ఓడిపోయి అదే నియోజకవర్గాన్ని నమ్ముకున్న నాయకులకు జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వలన తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో 8 నియోజకవర్గాలకు గాను ఒక్క ఒంగోలు నియోజకవర్గం మినహాయిస్తే మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను పూర్తిగా మార్చేశారు. 2019 ఎన్నికల్లో యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందిన ప్రస్తుత మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆ నియోజకవర్గం నుంచి తప్పించి కొండేపి నియోజకవర్గం నుంచి బరిలో దించేందుకు నిర్ణయం తీసుకుంది. అదే విధంగా గిద్దలూరు నియోజకవర్గంలో మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఒకసారి ఓటమిచెంది రెండుసార్లు ఎన్నికల్లో గెలిచిన అన్నా రాంబాబును మార్కాపురం నియోజకవర్గం నుంచి బరిలో దించుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి కేపీ కొండారెడ్డి అదే నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ నియోజకవర్గం ఆ కుటుంబానికి అచ్చొచ్చింది. ఆ నియోజకవర్గంలోనే పుట్టి పెరిగిన ఆ కుటుంబాన్ని కాదని గిద్దలూరు నియోజకవర్గం నుంచి ఈసారి ఎమ్మెల్యేగా నాగార్జునరెడ్డిని వైసీపీ అధిష్టానం బరిలో దించనుంది. మరోపక్క సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న టీజేఆర్ సుధాకర్‌బాబును పక్కనపెట్టి బాపట్ల జిల్లాకు చెందిన వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి మేరుగ నాగార్జునను బరిలో దించనుంది. కనిగిరి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యేగా ఉన్న బుర్ర మధుసూదన్ యాదవ్‌ను పక్కనపెట్టి హనుమంతునిపాడు జడ్పీటీసీ దద్దాల నారాయణకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. దర్శి నియోజకవర్గం నుంచి మద్దిశెట్టి వేణుగోపాల్‌ను మిగతా 2 లో ...

మహిళల ఆర్థికాభివృద్ధికే జగన్ కృషి

మంత్రి ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర-శింగరాయకొండ : డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు పూర్తిస్థాయిలో నాలుగు విడతల వైయస్‌ఆర్ ఆసర పథకం ద్వారా రుణమాఫీ చేశారని, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైయస్‌ఆర్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ అన్నారు. శింగరాయకొండ లోని జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన వైయస్‌ఆర్ ఆసరా 4వ విడత సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం రెండు సంవత్సరాలు కరోనా కష్టకాలంలో కూడా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నా సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. మండలంలో 1291 గ్రూపులకు 10.7 కోట్లు చెక్కులను అందజేశారు. స్త్రీ నిధి 2,02,50,000 రూపాయల చెక్కును అందించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలు రద్దు చేస్తామని చివరి ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ పథకం క్రింద ఒక్కొక్కరికి రూ.10వేలు అందించారని ఎద్దేవా చేశారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిపెస్టో ప్రకారం నూరు శాతం సంక్షేమ పథకాలు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డికి మహిళా సంఘాల లీడర్లందరూ పాలాభిషేకం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా కుల మతాలకు తేడా లేకుండా సంక్షేమ పథకాలు అందరికి మిగతా 2 లో ...

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం చుండూరు మండలం బోస్ రోడ్డులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం జరిగింది.మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అక్కడకు చేరుకుని తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాల ద్వారా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జవాబుదారీతనంతో అధికారులు పనిచేయాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించాలన్నారు.రెవిన్యూశాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయన్నారు.జెకెసి పోర్టల్‌లో ఇప్పటివరకు 294 అర్జీలు నమోదు కాగా, అందులో 275 అర్జీలను పరిష్కరించామన్నారు.మిగిలినవి త్వరగా పరిష్కరించాలన్నారు. ఒక అర్జీ గడువు తీరునప్పటికీ ఎందుకు పరిష్కరించలేదని అధికారులను నిలదీశారు.మరో 24 అర్జీలు మిగతా 2 లో ...

ఆపరేషన్ ఫర్ ఐక్యత వైపు కోన వెంకట్

- వైసీపీలో అసంతృప్తి నేతలు ఒకే తాటిపైకి
- బాబాయి కోసం అబ్బాయి రంగంలోకి
- మరోసారి కోన రఘుపతి గెలుపునకు మాస్టర్ ప్లాన్
- గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : “రావు గారూ నన్ను ఇన్వాల్వ్ చేయకండి సార్ ” అంటూ సీని రచయిత కోన వెంకట్ ఢీ సినిమాలో ఆయన రాసిన డైలాగ్ ఆయనే స్వయంగా బాపట్ల రాజకీయంలో ఆచరణలో పెట్టారు. తన బాబాయ్ కోన రఘుపతి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న బాపట్లలో వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. మరోవైపు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి కొంతమంది నాయకులు దూరంగా ఉంటుండగా మరి కొంతమంది పార్టీని సైతం వీడుతున్నారు. దీంతో రఘుపతి అన్న కొడుకు కోన వెంకట్ నేరుగా ఇన్వాల్వ్ అయి రంగంలోకి దిగారు. బాపట్లలో వైసీపీలో ఉన్న అసంతృప్తి నేతలో ఇంటికి వెళ్లి మరీ వారి పార్టీకి దూరంగా ఉంటున్న కారణాలు పరిస్థితులు వాకాబు చేశారు. ఎవరి వల్ల వచ్చిన సమస్య ఏమిటో అని కనుగొని పరిష్కార మార్గాలు చేపట్టారు. దీంతో నియోజకవర్గ వైసీపీలో ఉన్న అసంతృప్తులు ఒకే తాటిపైకి వస్తున్నారు.

– నియోజకవర్గంలోని కర్లపాలెం మండలం బాపట్ల రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషిస్తుంది. ఈ మండలం నుంచి రాజకీయ దురంధులు వెలిశారు.మరోవైపు అభ్యర్థి గెలుపు ఓటములను కూడా నిర్ణయించిందే కర్లపాలెం మండలమే. అటువంటి మండలంలో వైసీపీలో నాయకుల మధ్య అంతర్గత పోరు తారాస్థాయి చేరుకుని రాజకీయ దూషణలు వ్యక్తిగత దూషణలు చేసుకుంటుండే వారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న అంతర్గత పోరును తొలగించి వారందరినీ ఏకతాటిపైకి తెచ్చేలా కోన వెంకట్ ఆపరేషన్ ఆన్ ఐక్యతకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రధానంగా ఎమ్మెల్యే కోన రఘుపతికి దూరంగా ఉంటున్న ఎంపీపీ యారం వనజతో కోన వెంకట్ సంప్రదింపులు జరిపారు. తనను ఎంపీపీగా ఎన్నుకున్న నాటి నుంచి తనకు రాజకీయంగా అణిచివేస్తున్నారని ఏ కార్యక్రమాలకు ఆహ్వానించటం లేదని చేసిన వాఖ్యలకు ఫుల్‌స్టాఫ్ పడేలా కోన వెంకట్ ప్రతి కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజను ప్రత్యేకంగా ఆహ్వానించారు. మరోవైపు తమకు గౌరవం దక్కలేదన్న రెడ్డి సామాజికవర్గ నేతలతో సైతం నేరుగా ఇంటికి వెళ్లి ముచ్చటించి టీ టైమ్ విత్ కోన వెంకట్ అంటూ నాయకులతో పరిస్థితులు ముచ్చటించి చక్కబెట్టారు.

– కోన చారిట్రబుల్ ట్రస్టు ఆద్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మిగతా 2 లో ...

అంబేద్కర్‌వాదుల మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చీరాల : అంబేద్కర్‌వాదుల మహాసభను జయప్రదం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు చప్పిడి వెంకట్రావు అన్నారు. చీరాల అంబేద్కర్ భవన్‌లో దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జులియన్ అధ్యక్షతన అంబేద్కర్ వాదుల సోమవారం తలపెట్టిన మహాసభ కరపత్రికను కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు చేతుల మీదుగా ఆవిష్కరించారు. చుండూరు వాసు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయిన నేటికి దళితుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. సోమవారం జరిగే అంబేద్కర్ వాదుల మహాసభకు భారీఎత్తున అంబేద్కర్ వాదులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవరపల్లి రమేష్, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే జగన్ కృషి

(మొదటిపేజీ తరువాయి)

అందించిన ఘనత ఒక్క జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మహిళలు జగనన్నకు తోడుగా ఉండి మళ్లీ జగన్మోహన్‌రెడ్డి సీఎంను చేయాలని కోరారు. కొండెపి నియోజకవర్గానికి ఒక సేవకుడిగా జగన్మోహన్‌రెడ్డి నన్ను పంపిం చారని నన్ను మీరు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సామంతుల రవికుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జడ్పీ వైస్ చైర్మన్ వెన్నాబత్తిన అరుణ, ఎంపీపీ కట్టా శోభారాణి, మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ తన్నీరు సుబ్బారావు, వైయస్ఆర్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దాకా పిచ్చిరెడ్డి, తంబు సుబ్బులమ్మ, వైయస్ఆర్ సీపీ నాయకులు సలీం, టౌన్ పార్టీ అధ్యక్షులు పటేల్, సుల్తాన్, రియాజ్, ఇండ్లా సుజాత, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశీలించి పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

పునరావృతం కావడంపై ఆరా తీశారు.వాటిని సమగ్రంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని అధికారులకు ఆయన మార్గ నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, రేపల్లె ఆర్డీఓ హెలా షారోన్,ఎంపీపీ జె.రూబేను,మండల ప్రత్యేక అధికారి జెన్నమ్మ, తహసిల్దార్ దుర్గ, సర్పంచ్ సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ఫర్ ఐక్యత వైపు కోన వెంకట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ సామాజిక ఫించన్ తీసుకుంటున్న ఫించన్‌దారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో కోన వెంకట్ నాయకులందిని ఒకే వేదికపై ఉండేలా చూస్తూ దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న నాయకులను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్యే కోన రఘుపతిపై అసంతృప్తి వెళ్లగక్కే నేతలంతా కోన వెంకట్ భేటీలతో అసంతృప్తులను సంతృప్తి చేసుకుంటున్నారు. ఏదిఏమైనా రానున్న ఎన్నికల్లో కోన వెంకట్ పాత్ర బాపట్ల రాజకీయంలో అతికీలకం కానుంది. బాబాయ్ గెలుపును అబ్బాయి దగ్గర ఉండి గెలిపించేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇంటిని సైతం ఇక్కడే ఏర్పాటు చేసుకోవటం విశేషం. ఎన్ని పరిణామాలు జరిగిన రాబోవు ఎన్నికల్లో వర్గపోరుతో సతమతమవుతున్న వైసీపీ ఏ విధంగా గట్టెక్కుతుందో అని చర్చ జరుగుతుంది.

తక్కువ అంచనా వేస్తే..టీడీపీకి తప్పదు మూల్యం!

- మండలాల్లో ఆధిపత్య పోరు
- సొంత సామాజికవర్గంలో చీలికలు
- జనసేనతో అవగాహన రాహిత్యం
- ప్రచారంలో వైసీపీ దూకుడు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గత రెండు పర్యాయాలు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రేపల్లె నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ గెలుపొందారు. మూడోసారి కూడా గెలిచి హ్యాట్రిక్ సాధించాలని చూస్తున్నారు. అయితే గత రెండు పర్యాయాలు తన సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి అయిన మోపిదేవి వెంకటరమణారావుపై గెలుపొందడంతో పార్టీ అధిష్ఠానం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించింది.తదనుగుణంగా రాష్ట్ర ఐప్యాక్ టీంతో సర్వే చేయించి అభ్యర్థి మోపిదేవి అయితే మూడోసారి కూడా ఓటమి తప్పదని కొత్త అభ్యర్థిని రంగంలోకి దించితే తప్పకుండా గెలుస్తామని నివేదిక అందించడంతో అధిష్ఠానం వెంటనే కొత్త అభ్యర్థిగా ఈవూరి గణేష్‌ను రంగంలోకి దించింది. దీంతో అతనికి నియోజకవర్గ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.ముఖ్యంగా ఈ నియోజకవర్గంలో గౌడ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థి కూడా ఆ సామాజిక వర్గం వాడైతే ఓట్లలో చీలిక వచ్చి గెలుపు సాధ్యపడుతుందని దానికి తగ్గట్టు ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వారి సామాజికవర్గ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి సుడిగాలి పర్యటన చేస్తున్నారు.ఎంత తిరిగినా గెలుపు తమను దాటిపోదని ధీమాగా తెలుగుదేశం వ్యవహరిస్తుంది. అయితే ఇక్కడే వారికి అర్థం కాని చిక్కుముడి ఒకటి ఉంది. గతంలో ఆ సామాజికవర్గం నుండి 10 నుండి 20 శాతం ఓట్లు మాత్రమే వైసీపీకి పడేవి. ఇప్పుడు అది 60 లేదా 40 శాతంగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.ఇదే జరిగితే తెలుగుదేశం చిక్కుల్లో పడే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.దీనికి తోడు పార్టీలో అంతర్గత పోరు ఆధిపత్య పోరు నివురు గప్పిన నిప్పుల ఉండటం కొంత ఆందోళన కలిగించే విషయమే. జనసేనను మిత్రపక్షంగా అన్ని విషయాల్లో కలుపుకుపోవడం లేదని అసంతృప్తి వారిలో ఉంది. వీటన్నిటిని అధిగమించి అందర్నీ కలుపుకుంటూ ఎన్నికలపై దృష్టి సారిస్తేనే ఫలితం ఉంటుందని సామాన్య జనం అనుకుంటున్నారు. చిన్న పామునైన పెద్దకర్రతో కొట్టాలన్న చందంగా గెలుపుపై ధీమాగా ఉంటే మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజలు భావిస్తున్నారు.

జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక రెండవ జాబితా

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఆదేశాలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శీలం వెంకటేశ్వర్లు పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థుల రెండవ జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో 17 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. మాట్లాడుతూ ఇప్పటివరకు 52 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించామన్నారు.మూడో విడత మరో 50 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటిస్తామని రాష్ట్రవ్యాప్తంగా జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ 100కు తగ్గకుండా అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుందన్నారు.గత పాలకులు పేదలకు న్యాయం చేయ లేదని పేదరికం లేని సమాజం నిర్మించాలంటే రాజ్యాధికారంలో పేదలకు భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో పార్టీని స్థాపించడం జరిగిందన్నారు.రాష్ట్ర ప్రజలందరూ మద్దతు ఇచ్చి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ సభ

విశాలాంధ్ర - కర్లపాలెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత పంపిణీ కార్యక్రమం సభ కర్లపాలెంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఏపీఎం శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లాపుల ఏడుకొండలు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై ఆసరా నగదు బ్యాంకు చెక్కు ద్వారా మహిళలకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని వారు తెలిపారు.

ఉపాధ్యాయుడుకి పరామర్శ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గోకులంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పావని రవికుమార్‌ని కనిగిరి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన అనారోగ్యానికి గురి కావడంతో వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట వెలిగండ్ల మండల నాయకులు కొండు విజయభాస్కర్‌రెడ్డి, గోరిగే సుబ్రమణ్యం తదితరులున్నారు.

స్థాన చలనంతో విజయం వరిస్తుందా!

(మొదటిపేజీ తరువాయి)

కాదని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఇలా వచ్చే ఎన్నికల్లో బరిలో దించే అభ్యర్థులను పక్క నియోజకవర్గాలకు షిఫ్ట్ చేసి బరిలో దించేందుకు వైసీపీ నిర్ణయం తీసుకుంది. దీని వలన అభ్యర్థులు ఎలా గెలుస్తారు అనేది అందరిలోను ప్రశ్నార్థకంగా మారింది. జగన్మోహన్‌రెడ్డి మాత్రం స్థాన చలనం చేయడం వలనే వారి విజయం వరిస్తుందని పూర్తిస్థాయిలో నమ్మకంగా ఉన్నారు. రకరకాల సర్వేలు చేయించిన అనంతరం జగన్మోహన్‌రెడ్డి ఇలాంటి నిర్ణయం తీసుకొని ఉండవచ్చని భావిస్తున్నారు. రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు పెట్టుకొని ఒక్కసారిగా ఎమ్మెల్యే అభ్యర్థులను పక్క నియోజకవర్గాలకు మార్చడం వలన స్థానికంగా అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. ఆయా నియోజకవర్గాల్లోని మండల నాయకులను అర్థం చేసుకొని ఆయా నియోజకవర్గంలోని ప్రజల నాడి పట్టుకోవడం ఒక్కసారిగా ఎమ్మెల్యేలను మారుస్తే అసంతృప్తిగా ఉన్న నాయకులను బుజ్జగించుకొని వీటన్నింటిని సరిచేసుకొని ఎన్నికల క్యాంపెన్‌ను నిర్వహించుకోవడం ప్రస్తుతం వారికున్న లక్ష్యం. ఈ రెండు నెలల్లో ఇది సాధ్యపడుతుందా. అసలు నాయకులను ఎందుకు మార్చాల్సి వస్తుంది. దీని వలన పార్టీకి నష్టం తప్ప ప్రయోజనం ఎలా జరుగుతుందని అందరిలో ఉత్పన్నమవుతున్న ప్రశ్న. ఒక్కసారిగా అధిష్ఠానం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పట్ల అభ్యర్థుల్లోనే తెలియని అయోమయం, ఆందోళన, భయం వ్యక్తమవుతున్నా బయటకు గంభీరంగానే కన్పిస్తున్నారు. వారి సన్నిహితుల వద్ద జగన్మోహన్‌రెడ్డి పిచ్చి తుగ్లక్ నిర్ణయాల వలన అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న 8 నియోజకవర్గాల్లో ఒంగోలు ఇంకా ఖరారు చేయలేదు. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యేలను కాదని కొత్తవారికి అవకాశం కల్పించారు. దీంతో ఆయా ఎమ్మెల్యేల అభ్యర్థుల తలుపుతట్టుకొని ఆయా నియోజకవర్గాల్లో నాయకులను బుజ్జగించుకొనే పనిలో నిమగ్న మయ్యారు. అయినా జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం పట్ల అసంతృప్తి కూడా వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలను అటు ఇటు మార్చారు. ఈ నియోజకవర్గాల నిర్ణయాల పట్ల కొంత అన్నా రాంబాబు సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇప్పుడు గిద్దలూరు నియోజకవర్గం వెళ్లి ఏం చేయాలి, ఈ సమయంలో నియోజకవర్గాన్ని మార్చడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు పోటీలో దిగుతారా వెనక్కు తగ్గుతారా అనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతుంది.

ఇంకా ఖరారు కాని ఎంపీ, ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి

ఇప్పటికే జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గాను ఏడు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులకు స్థాన చలనం కల్పించగా ఒంగోలు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల పేర్లు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించబోమని స్పష్టం చేశారు. ఒంగోలు ఎమ్మెల్యేగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆ పార్టీలో రకరకాల సమస్యలు ఎదురవుతున్నాయి. అసలు వైసీపీ నుంచి బాలినేని పోటీ చేస్తారా లేదా మరో పార్టీ నుంచి బరిలో దిగుతారా అనేది అందరిలోను తలెత్తుతున్న ప్రశ్న. జిల్లాలో వైసీపీ చక్రం తిప్పిన బాలినేని శ్రీనివాసరెడ్డి పేరే ఇంతవరకు ప్రకటించలేదు. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేశారు. బాలినేనికి వైసీపీలో ఇంత అవమానం ఎందుకు జరుగుతుంది, మాగుంటతో పాటు బాలినేనిని కూడా ఎందుకు దూరం పెడుతుందనేది అందరిలో ప్రశ్న. ఇప్పటికైతే ఒంగోలు ఎంపీ మాగుంటను కాదని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరును ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. స్థానికులను వదిలి వలసనాయకులకు ప్రజలు ఎలా పట్టం కడతారో మరీ చూడాలి.

నిస్వార్థ ప్రజా సేవకుడు దేవరంపాటి వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : సిపిఐ ఎం నగర సీనియర్ నాయకులు, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ ఉద్యోగి దేవరంపాటి వెంకటసుబ్బయ్య శనివారం స్థానిక సచివాపురంలోని ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. వీరి మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. అనంతరం సత్యనారాయణపురం నుండి డిబ్బల్ రోడ్డు మీదుగా ఆర్టీసీ డిపో దగ్గర గల హిందూ స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర సాగింది. సంతాప సందర్భంగా సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు వై సిద్దయ్య, సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ కొప్పోలులో వృత్తిదారుల కుటుంబంలో పుట్టిన ఆయన బిఎస్ఎన్ ఎల్‌లో ఉద్యోగి గా చేరి బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు అని తెలిపారు. రిటైర్ అయిన తర్వాత రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి వారి సమస్యలపై పనిచేశారని తెలిపారు. 2005వ సంవత్సరంలో సిపిఎంలో చేరిన ఆయన నగరంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం వైపు చివర వరకు నిలబడి కమ్యూనిస్టు నేతగా సత్యనారాయణపురం ప్రాంతంలో గుర్తింపు తెచ్చు కున్నారని చెప్పారు. సందర్భంగా పట్టణ ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు వారికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పలువురు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

విశాలాంధ్ర-ఒంగోలు : జనసేన పార్టీ కార్యాలయం లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ సమక్షంలో జనసేన పార్టీ లో చేరారు. సింగరాయకొండ మండల వైస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్కె.ఖాజా యూసుఫ్, మూలగుంటపాడు 9వవార్డ్ మెంబెర్ ఎస్కె. తస్లీమ్, వైస్సార్సీపీ సింగరాయకొండ నాయకులు,షేక్ కరీం భాషా,పి.మల్లికార్జున, షేక్ ఖాజావలి,పలనీ రాజా, పలనీ రామచంద్ర,పలనీ యుగంధర్, షేక్ రసూల్, వైస్సార్సీపీ మహిళ నాయకులు రజియ తదితరులు పార్టీలోకి చేరారు.

బీసీ భవన్‌కు రూ.50లక్షలు మంజూరు

విశాలాంధ్ర-ఒంగోలు : ఎంపీ లాండ్స్ నుండి బిసి భవన్‌కు రూ.50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో మంజూరైన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డిని బిసి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి తిరుపతి రావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ పథకాలు విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జాతీయ ప్రచార పథకాల ను ప్రజలకు చేరవేసే విషయంలో చీమకుర్తి రెడ్డి బజార్ సచివాలయ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపవరపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, మరియు మున్సిపల్ కమిషనర్ ఎన్. ఈశ్వర్ రాజు కలసి ఆవిష్కరించారు. ఈ ప్రచారంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్నటువంటి పథకాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్మెంట్, హౌసింగ్ డిపార్ట్మెంట్, గ్యాస్ ఏజెన్సీ మరియు మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ భేగ్‌ను సన్మానించిన జమా ఆతే ఇస్లామీ హింద్

విశాలాంధ్ర-మార్కాపురం : వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఏ.యమ్.సీ నూతన చైర్మన్ డాక్టర్ షంషీర్ అలీబేగ్, డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ మగ్బుల్ బాషా, డైరెక్టర్ పియల్.పి యాదవ్‌లకు జమాఅతే ఇస్లామీ హింద్, ఎస్ఐఓ, ఐవైఎమ్ నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమాఅతె ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షులు అష్రఫ్ అలీ,జె.ఐ.హెచ్ పట్టణ అధ్యక్షులు సికిందర్, ఎస్ఐఓ రాష్ట్ర సభ్యులు ఖాలిద్, ఐవైఎమ్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, జె.ఐ.హెచ్ సభ్యులు నజీర్, సలీం, కార్యదర్శి మొహమ్మద్ ఖాన్,కార్యకర్తలు అయాబ్ ఖాన్, ఖాసింబాషా, నజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : పంటల ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయాలని ఏడిఏ ఐవి రమణ అన్నారు. శనివారం కనిగిరి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారుల జోష్న, శిల్ప ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ఉన్న ఎరువుల నిల్వలు వివరాలపై చర్చించారు. ఈకేవైసీ, పియం కిసాన్ నమోదు వేగవంతం చేయాలన్నారు. బాపట్ల జిల్లా విలేజ్ వ్యవసాయ సహాయకురాలు బెల్లంకొండ పూజిత చనిపోవడంతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ స్నేహితులు పాల్గొన్నారు.

టీడీపీ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులుగా నాగేశ్వరరావు, వాసు కృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ ఒంగోలు నగర కమిటీ అధ్యక్షులుగా రెండోసారి 12వ డివిజన్‌కు చెందిన కొఠారి నాగేశ్వ రావుని నియ మించడం జరిగినది. ప్రధాన కార్యదర్శిగా 7వ డివిజన్‌కి బొల్లినేని వాసుకృష్ణని, ఉపాధ్యక్షులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, సెక్రటరీలు, అధికార ప్రతినిధి, కోశాధికారి మొత్తం 28మంది సభ్యులతో జనార్ధన్ ప్రకటించడం జరిగినది. జనార్ధన్ సూచిస్తూ రాబోవు సార్వత్రిక ఎలక్షన్స్‌లో మీ వంతు పాత్ర పోషించి,గెలిపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని నూతన కమిటీకి తెలియజేశారు.అధ్యక్షులుగా ఎన్నికైన కొఠారి నాగేశ్వరావు మాట్లాడుతూ 2024 ఎలక్షన్స్ లో ఖచ్చితంగా మిమ్మల్ని ఎమ్మెల్యే గెలిపొందించే వరకు నిద్రహారాలు మాని కచ్చితంగా పనిచేస్తామని వారు కమిటీ తరపున జనార్ధన్‌కి హామీ ఇచ్చారు.

కోడిపందెం నిర్వాహకులు అరెస్ట్

విశాలాంధ్ర-టంగుటూరు: కోడిపందెం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు టంగుటూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కదనం మేరకు పసుకుదురు గ్రామ పొలాల్లో కోడిపందెం నిర్వహిస్తున్న ముగ్గురువ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వారి వద్దనుండి రెండు కోళ్లు, 17200 రూపాయల నగదును స్వాధీన పరుచుకున్నామని టంగుటూరు ఎస్ఐ అందెల నాగేశ్వరరావు తెలిపారు. పట్టుబడిన ముగ్గురువ్యక్తులను అరెస్టుచేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని, అక్రమ మద్యం రవాణా, జోదరుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య ఉద్యోగాలను కొండెక్కించిన జగన్ ప్రభుత్వం

- ఎన్నికలవేళ ఉద్యోగాలు ఇస్తానంటూ కారుణ్య ఉద్యోగాలకు 'కొత్త నిబంధనలు'

-దళిత నేత నీలం నాగేంద్రరావు ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు : ఎన్నికలవేళ కొత్త ఉద్యోగాలు ఇస్తానంటూ చెప్పిన జగన్ చనిపోయిన ఉద్యోగస్తుల వారసులకు ఇచ్చే కారుణ్య ఉద్యోగాలను భర్తీ చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా కత్తిరేశారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. శనివారం తన కార్యాలయంలో నీలం నాగేంద్రం మాట్లాడుతూ గత మూడు నెలలుగా రాష్ట్రంలో కారుణ్య నియామకాలు జరపకుండా సంబంధిత ఫైల్లు కలెక్టర్ల వద్దే నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు సర్వీసులో ఉండి చనిపోయినప్పుడు వారి వారసులకు కారుణ్య ఉద్యోగం ఇవ్వవలసి ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వ శాఖల తో పాటు జగన్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాల సిబ్బంది చనిపోయిన వారి కుటుంబాలకు కూడా కారుణ్య ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. అలాగే ఆర్టీసీని కార్పొరేషన్ చేసినందువలన ఆర్టీసీలో చనిపోయిన ఉద్యోగస్తుల పిల్లలకు కూడా కారుణ్య ఉద్యోగాలు ఇవ్వవలసి ఉందన్నారు. ఆర్టీసీ మరియు సచివాలయ సిబ్బంది మరణించినట్లయితే వారి వారసులకు కూడా కలెక్టరేట్ జనరల్ పూల్ లో ఉద్యోగాలు జిల్లా కలెక్టర్ ఇవ్వవలసి ఉందన్నారు. గత మూడు నెలల వరకు జిల్లా కలెక్టరేట్లో ఈ కారుణ్య నియామకాల ప్రక్రియ సజావుగానే సాగిందన్నారు. కానీ జగన్ నిర్వాకం వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధోగతిగా మారినందువలన కారుణ్య నియామకాలకు కాసులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడు నెలలుగా ఫైల్లు కలెక్టరేట్లో ఆపేసిన ప్రభుత్వం ఈరోజు బరితెగించి కారుణ్య ఉద్యోగాలు ఇవ్వకుండా కొత్త ఎత్తుగడ చేపట్టిందన్నారు. కారుణ్య నియామకాలకు కూడా గ్రూప్ 4 లెవెల్ లో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా శాఖలు కేటాయిస్తామని జగన్ ప్రభుత్వం మెలిక పెట్టిందన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం జయప్రదం చేయండి



సానికొమ్ము తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-హనుమంతుని పాడు : మండలం తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 9.30గం. లకు తెలుగుదేశం పార్టీ కార్యాలయం అమరావతి గ్రౌండ్ నందు ఏర్పాటు చేయటం జరిగిందని మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలియజేశారు. అలానే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మరియు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారు.కావున మండలంలోని 23 పంచాయతీల గ్రామపార్టీ అధ్యక్షులు, కార్యవర్గం అనుబంధ సమస్తమైన తెలుగు యువత, తెలుగు మహిళ,బీసీ,మైనార్టీ, ఎస్సీ,ఎస్టీ, తెలుగు రైతు,లీగల్ సెల్,కమిటీలు, రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, నాయకులు, క్లస్టర్,యూనిట్, బూత్, ఇంచార్జ్ లు ఐటీడీపీ,టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు అభిమానులందరూ కలసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలియజేశారు.

వేలం ప్రకటన

కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాత గదుల పైకప్పును తొలగించగా వచ్చిన పాత టేకు కలపను 06-02-2024 తేదీన వేలము వేయబడును. వేలములో పాల్గొనదలచిన వారు ముందుగా 10,000/- రూపాయలు ధరావత్తు చెల్లించి వేలములో పాల్గొనవచ్చును. వేలము ముగిసిన అనంతరము మిగిలిన పైకము చెల్లించి కలపను స్వాధీనము చేసుకొనవలెను. వేలము నిర్వహణలో తుది నిర్ణయము పాఠశాల యాజమాన్యము వారిదే.

ప్రధానోపాధ్యాయుడు
ఉపాధ్యాయ సిబ్బంది

వృద్ధులకు అండగా మానవతా స్వచ్ఛంద సంస్థ

విశాలాంధ్ర - చీరాల : నిరాశ్రయులైన వృద్ధుల అవసరాలను గుర్తించి,వారికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు మానవతా సంస్థ ముందువరుసలో ఉంటుందని సంస్థ అధ్యక్షులు ఏ.నాగ విరాభద్రాచారి అన్నారు.మానవతా సేవ సంస్థ,రాధ కృష్ణ మందిర కమిటీ ఆధ్వర్యంలో చీరాల పాపరాజు తోట పరిసర ప్రాంతాలలో నిరాశ్రయులైన నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బత్తుల బ్రహ్మ రెడ్డి, రాధ కృష్ణ కమిటీ అధ్యక్షులు నల్లూరి బ్రహ్మం,గాదె హరిహరరావు,పి.శివఆంజనేయ ప్రసాద్, కోటక్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ లక్ష్మణరావు, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చిదంబర శాస్త్రికి సత్కారం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : అయోధ్యలోని రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ట సమయంలో ఉపయోగించే యంత్రాన్ని చీరాల నివాసి విశ్రాంత అధ్యాపకులు అన్నదానం చిదంబర శాస్త్రి రూపొందించారు.ఆ యంత్రాన్ని విగ్రహ ప్రతిష్ఠలో ఉపయోగించారు. చిదంబర శాస్త్రి దంపతులను ఆయన గృహంలో చీరాల బ్రాహ్మణ సంఘం తరపున అన్నంరాజు సుబ్బారావు దంపతులు దుశ్శాలువలు కప్పి,నూతన వస్త్రాలు సమర్పించి ఘనంగా సన్మానించారు. మాట్లాడుతూ దేశ వాసుల కలలను నెరవేరుస్తూ అయోధ్యలో రామ మందిర నిర్మాణం జరగడం,అందులో చీరాల వాసి భాగస్వామ్యం ఉండడం క్షీరపురి ప్రజలకు దక్కిన అరుదైన గౌరవం అన్నారు.ఈ కార్యక్రమంలో గంగవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ సభకోసం పరీక్షను వాయిదా వేయడం దారుణం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సభలకు జనాన్ని తరలించేందుకు బస్సులు ఉపయోగించే ఉద్దేశ్యంతో విద్యార్థుల ఇంటర్మీడియేట్ పరీక్షను వాయిదా వేయడం విద్యా వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగించడమేనని చీరాల నియోజకవర్గ తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు.జగన్ సైకో మనస్తత్వంతో విద్యార్థులను, నిరుద్యోగులను మోసగించడం దారుణమైన విషయ మన్నారు. నిరుద్యోగులను మోసం చేస్తూ తక్కువ పోస్టులతో దగా డీఎస్సీని ప్రకటిస్తున్నారన్నారు.రాష్ట్రాన్ని గంజాయి రవాణాలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం వైకాపా అరాచక పాలనకు నిదర్శనమన్నారు.నియోజక వర్గంలోని ప్రసాద్ నగరం ఎస్టీ కాలనీ యానాదుల సామాజికవర్గ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వైకాపా పాలనలో ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతికి చేపట్టిన చర్యలు శూన్యమన్నారు.సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించి వారి అభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించారన్నారు.

ప్రభుత్వ తీరు నచ్చక సచివాలయ ఉద్యోగి రాజీనామా

– దళితులపై వైసీపీ ప్రభుత్వ వైఖరిపై నిరసన

విశాలాంధ్ర - చీరాల : రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి దళితుల పట్ల చెబుతున్నది ఒకటి చేస్తున్నది ఒకటని దళితుల పట్ల ప్రభుత్వ తీరు నచ్చక స్వచ్ఛందంగా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నానని చీరాల విఠలనగర్ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కొనిదల విజయ్ కుమార్ అన్నారు.రాష్ట్రంలో దళితుల పట్ల ప్రభుత్వం పాటిస్తున్న వైఖరి నచ్చక వెల్ఫేర్ సెక్రటరీ కొనిదల విజయ్‌కుమార్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి చీరాల మునిసిపల్ కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ దళితుల మేనమామ అని చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళితులకు ఉన్న 27 రకాల ఎస్సీ కార్పొరేషలన్నీ రద్దు చేశారన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూని వర్సిటీలో ఎం.ఏ.ఎం.ఫిల్ సామాజిక శాస్త్రంలో పూర్తి చేసానని, అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని జగన్ విదేశీ విద్యగా పేరు మార్చు చేయడాన్ని జీర్ణించు కోలేకపోతున్నానని అందుకే ఈ ప్రభుత్వంలో వచ్చిన ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానన్నారు. జగన్మోహన్ ఒకవైపు దళితులను అణచివేస్తూ దళితుల ఓట్లకు గాలం వేస్తున్నారన్నారు. గంపగుత్తగా దళితుల ఓట్లు ఈ ప్రభుత్వానికి కావాలి కానీ దళితుల సంక్షేమం మాత్రం పట్టదన్నారు.ఈ రాష్ట్ర ప్రభుత్వం తీరు వలన దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్రంలో ఉన్న దళితులకు తెలియపరచేందుకు సంసిద్ధ పడుతున్నానని దళితులను ఒకే తాటి పైకి తెచ్చేందుకు నా వంతు ప్రయత్నిస్తానన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - బాపట్ల : రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలో శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా బ్లాక్ స్పాట్స్‌లలో పోలీసులు విధులు నిర్వహిస్తూ రోడ్డు భద్రత నియమాలు,మోటారు వాహనాల చట్టల గురించి వాహన చోదకులకు ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వలన కలిగే ఉపయోగాలను ప్రజలకు వివరించారు.ఓవర్ లోడ్, ట్రిపుల్ రైడింగ్‌లో వాహనాలను నడపడం వలన రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు.మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన కలిగే అనర్థాలు వివరించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.

జగన్‌ను ఓడించేందుకు యువత సిద్ధం : ఎమ్మెల్యే గొట్టిపాటి

విశాలాంధ్ర-అద్దంకి : జగన్‌రెడ్డి ఇచ్చింది మెగా డిఎస్సీ కాదని-దగా డిఎస్సీ అని నిరుద్యోగులను మోసం చేసిన జగన్‌రెడ్డిని ఓడించేందుకు యువత సిద్దంగా ఉన్నారని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం ఆయన పత్రికా ప్రకటన ద్వారా మాట్లాడుతూ డిఎస్సీ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందని,ఎన్నికల ముందు మెగా డిఎస్సీ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇన్నాళ్ళు కాలయాపన చేసి తీరా ఎన్నికల సమయం వచ్చేసరికి సీఎం జగన్‌రెడ్డికి నిరుద్యోగులు గుర్తుకువచ్చారా అని ధ్వజమెత్తారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 50,896 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నాడు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఊరూరా తిరుగుతూ మెగా డిఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన జగన్ గడచిన ఐదేళ్ళుగా తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రపోయి ఎన్నికల ముందు 6,100పోస్టులకు అనుమతి ఇవ్వడం రాజకీయ లబ్ధికాక మరేంటని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్వవైభవం రావాలంటే తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసిన కనిగిరి మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-కనిగిరి : ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మర్యాద పూర్వకంగాను కలిసి శాలువాతో సత్కరించారు. కనిగిరి పట్టణంలోని ట్రాఫిక్ సమస్య రోజురోజుకు అధికమవుతుందని, బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన దృశ్య ఆ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన కోరారు. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే కనిగిరి మున్సిపాలిటీలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు ఉండదన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరగా నష్టపరిహారం అదే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి పనులు వేగవంతంగా చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదాలను అరికడదాం..

విశాలాంధ్ర-దొనకొండ: రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకుని అరికడదామంటూ త్రిపురాంతకం సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం దొనకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐ సంపత్‌కుమార్ మరియు సిబ్బందికి పలు సూచన, సలహాలం దించారు. విలేఖరులతో మాట్లాడుతూ గత రెండున్నర ఏళ్ళుగా పోలీసు శాఖ రోడ్డు ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పిస్తుందని, దీంతో రోడ్డు ప్రమాదాలు ఘణనీయంగా తగ్గాయన్నారు. ప్రజల మంచి కోసం పోలీసు వారి సూచన, సలహాలను పాటించి సహ కరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని అల్లినగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మత్తులు చేస్తున్న నేపథ్యంలో అల్లినగరం, ఎర్రగుంట్ల, తిమ్మారెడ్డిపల్లి గ్రామాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని తెలిపారు.

సబ్‌జైల్‌ను పర్యవేక్షించిన సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక సబ్ జైల్ నందు ఉన్న ఖైదీలలో 18 నుండి 22 సంవత్సరాల లోపు యువతి, యువకులను గుర్తించడం కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ,కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఒంగోలు కె.శ్యామ్ బాబు పర్యవేక్షించారు. ఖైదీల కేసుల వివరములు మరియు ఆరోగ్య, కుటుంబ వివరములు తెలుసుకున్నారు. 10 మంది మగ ఖైదీలు 1 ఆడ ఖైదీ ఉన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు మండల న్యాయ సేవాధికార సంస్థ తరుపున ఉచితంగా న్యాయ వ్యాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సబ్ జైల్ లోని స్టోర్ రూమ్, భోజన శాల, విశ్రాంతి గదులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, జైల్ అధికారులకు కొన్ని సలహాలు, సూచనలు చేశారు. ఖైదీల పట్ల అంకిత భావంతో ఉండాలని తెలియజేసారు. అదేవిధంగా మార్కాపురం, దర్శి జైల్ ను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరిండెంట్ యూ.లింగా రెడ్డి,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు,కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైని సన్మానించిన చిలకల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఎస్సైగా ఎం శివ శుక్రవారం బాధ్యతలు చేపట్టడంతో బల్లవరం వైఎస్ఆర్‌సిపి నాయకులు చిలకల నారాయణరెడ్డి శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పర్చూరు: గ్రామాలలోని సమస్యలపై అందించే అర్జీలను అధికారులు పరిష్కరించాలని ఎంపిపి మేకా ఆనందకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను ప్రజలకు సకాలంలో అందించాలని, అర్హులకు పథకాలు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు పాల్గొని పథకాల అమలు, ప్రజలకు మంజూరు అయిన పథకాలను తెలిపారు. ఈఓఆర్డీ రామకృష్ణ, అధికారులు, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు అందించాలి

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని చెరుకూరులో వేంచేసి యున్న శ్రీత్రివిక్రమ, అగస్తేశ్వర స్వామివార్ల దేవస్థానమునకు ధర్మకర్తల పాలక మండలి ఏర్పాటుకు గుంటూరు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉపసంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య శనివారం తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 3వ తేది నుండి 20 రోజులలోపు బాపట్ల జిల్లా ఎండోమెంట్ అధికారికి దరఖాస్తులు అందించాలని కోరారు.

తహసీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

విశాలాంధ్ర-పర్చూరు: విశాఖపట్నం జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్న రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తూ...శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ రమణయ్య హత్యకు కారకులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక భూవివాదాలు ఉన్న మండలాల తహశీల్దార్లకు, విఆర్వోలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు విధి నిర్వహణలో ఉన్న సమయంలో విధులకు ఆటంకాలు, దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకొనుటకు కఠినమైన చట్టం తీసుకురావాలని రెవెన్యూ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరటం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.సంధ్యశ్రీ, రెవెన్యూ సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ప్రేమ్‌కుమార్, విఆర్ఓ సంఘం నాయకులు సుబ్బారావు, రవి, సర్వేయర్ సంఘం నాయకులు సుబ్బారావు, ఏడుకొండలు, ఏఎన్ఓ శ్రీమన్నారాయణ, డీటీ నాగలక్ష్మీ, గ్రామ సర్వేయర్లు, విఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించాలి

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాలలోని దుకాణ దారులు, సంస్థల వారు తప్పని సరిగా దరఖాస్తు చేసుకొని చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సహాయ కార్మిక అధికారి ఆర్.అబ్రహం శనివారం తెలిపారు. రిజస్ట్రేషన్ చేయించుకునే విధంగా సహకారం అందించాలని కోరారు.

వైఎస్ షర్మిల రోడ్ షోను విజయవంతం చేయండి

కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఈ నెల 7వ తేదీన బాపట్లలో జరిగే రోడ్ షోను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జీ కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్నం సతీష్‌ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో శనివారం పార్టీ నాయకుల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులతో 7వ తేదీ జరగబోయే రోడ్‌షో గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జేడీ శీలం మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలుగా ఎంపికైన తరువాత తొలిసారి షర్మిల బాపట్ల రానున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అన్నీ వర్గాల ప్రజలకు సమన్యాయం, సమనత్వం,సంక్షేమం జరుగు తుందన్నారు. 7వ తేదీన 20 వేల మందితో రోడ్ షో ఉంటుందన్నారు.ప్రతి కార్యకర్తను కలుపుకొని వెళ్లడమే లక్ష్యంగా కార్యచరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం,తాడికొండ వెంకటేశ్వ రరావు, బుగ్గా సుబ్బారావు,అను ప్రవల్లిక, తుమ్మల సుబ్బారావు, ఆదినారాయణ, కళ్యాణ్ చక్రవర్తి, సురేంద్ర, తోట శివ నాగేశ్వరరావు, దేవరపల్లి రంగారావు, కేసన రామకోటేశ్వరరావు, పఠాన్ రాజేష్,ధోనేపూడి దేవరాజు,దండు రేణుక, శీలం సాగర్, 7 నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యని పరిష్కరిస్తా : పిచ్చయ్య

విశాలాంధ్ర-దర్శి : దర్శి నగర పంచాయతీలోని అన్నీ వార్డుల్లో తాగునీటి సమస్యని పరిష్కరిస్తానని దర్శి నగరపంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. శనివారం 12వ వార్డులో పర్యటించిన సమస్యలను తెలుసుకున్నారు.చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ వార్డులో ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా వాటర్ పైప్ లైన్ ఏర్పాటు కొరకు ఎన్ఎపి అధికారులను ఆదేశించారు.సిబ్బందితో కలిసి అన్నీ వార్డుల్లో పర్యటించి వస్తావా పరిస్థితులను పరిశీలించారు. ఈ పర్యటనలో అయన వెంట కౌన్సిలర్లు నక్కా రంగా, దినకర్, నాయకులు సైదారావు, మీరావలి, అంజి తదితరులు పాల్గొన్నారు.

భారతీయరూపాయి సేవతో యువకుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని మల్లారెడ్డిపల్లి యువ కుడు యం.రఫీ అనే చెక్కపని చేసుకొనె వ్యక్తికి గోపానిపల్లి దగ్గర కుక్క అడ్డుగా రావడముతో ప్రమాదం జరిగి తలకు బలంగా దెబ్బలు తగిలి స్పృహ కోల్పోవడం జరిగింది. తరువాత చికిత్స కోసం నంద్యాల కేవీర్ ప్రైవేట్ హాస్పిటల్ నందు జాయిన్ చేశారు. ఆర్థిక స్తోమత సరిగ్గా లేదు అని వారి ఫ్రెండ్స్ సహాయంతో కొంచెం డబ్బుతో చికిత్స అందించారు న్యూస్ ద్వారా సహాయం కోరడంతో దానికి స్పందించి నిన్న సాయంత్రం భారతీయ రూపాయి సేవ ద్వారా మల్లారెడ్డి పల్లి గ్రామంలో యువకులు సహాయంతో పేదలు పేదలు ప్రతిరోజు ఒక్క రూపాయి సహాయం చేసుకోవాలి అన్న ఆశయంతో స్పందించి భిక్షాటన చేసి ప్రజల సహాయంతో 7500 తన రూపాయి ఫ్యామిలీ నంబర్స్ అయిన సంపత్ వినయ్ విరసాల్ 1000 షేక్ రహంతుల్లా 500 ప్యాంం ఆర్ఎంపి శిరీష 500 మల్లారెడ్డి పల్లి యువకులు చేపినట్టు మొత్తంగా 9500 రూపాయిలు 5500 స్కాన్ బిల్ కట్టి మిగిలిన డబ్బుని 4000 రూపాయిలు ఖాదర్‌కి ఇచ్చి తరువాత ఆర్ఎంపీ సహాయంతో వైద్య ఖర్చులు తగ్గించి రఫిని వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

జై జవాన్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కొమరోలు : గత 4 రోజుల క్రిందట మల్లారెడ్డి పల్లె గ్రామానికి చెందినటువంటి షేక్ రఫీ పని నిమిత్తం వెళ్లి ఇంటికి వస్తున్న మార్గ మధ్యలో కుక్క అడ్డువచ్చి బైక్ మీద నుండి క్రింద పడటం వలన అతని తలకు బలమైన గాయం తగలడం వల్ల మెరుగైన చికిత్స కోసం నంద్యాలలో అడ్మిట్ అయ్యారు. చికిత్స కోసం ఆర్థికంగా బీదవారు కావటం వలన దాతల కోసం ఎదురు చూస్తున్న సమయంలో మన జై జవాన్ సేవా ఫౌండేషన్ తరపున 26 వేల 500 రూపాయలు సుబేదార్ ఈశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా షేక్ రఫీ కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది. ఈశ్వర్ రెడ్డి కొండయ్య గారు, నాయక్ రాంభూపాల్ గారు, మూలపల్లి గ్రామం వాలంటరీ కొండారెడ్డి గారు మానసిక వికలాంగుల పాఠశాల హెడ్మాస్టర్ గోపాల్ రెడ్డి గారు మరియు మల్లారెడ్డి పల్లె గ్రామ పెద్దల సమక్షంలో డబ్బులు ఇచ్చి అతని బాగోగులు అడిగి తెలుసుకుని వారిని ఓదార్చడం జరిగింది. ఇందుకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ ఆ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలపటం జరిగింది.

కబడీ జట్టును అభినందించిన 'ఆమంచి'

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదా ఆంధ్ర జిల్లా స్థాయి కబడీ పోటీలలో చినగంజాం మండలంలోని కొత్తపాలెం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ విజేత జట్టును అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

విశాలాంధ్ర-కనిగిరి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఉపయోగ పడుతుందని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరి బ్రదర్స్ స్కూల్ నందు మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు కుట్టు మిషన్ నేర్చుకున్న వారికి ఉపాధి అవకాశాలకు పొందవచ్చు అని అన్నారు. కనిగిరి ప్రాంతానికి మాగుంట వారు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి నిలిచాయని అన్నారు. శిక్షణ అనంతరం శిక్షణ పొందిన వారికి మిషన్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ దేవకి సత్యవతి, దేవకి రాజీవ్,జానీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుడారి అబ్రహం లింకన్, మన్సూర్, కనమర్లపూడి లక్ష్మి, నాయిబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర-దొనకొండ: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని వెంకటాపురం గ్రామానికి వెళ్ళే రహదారిలో శు క్రవారం రాత్రి జరిగింది. తెలిసిన వివరాలు... వెంకటాపురం గ్రామానికి చెందిన కొంగలేటి కరుణాకర్, కొంగలేటి కృపయ్య ద్విచక్ర వాహనంపై దొనకొండకు వస్తున్నారు. ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ఆటో వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి 108 సిబ్బంది వెలుగొండయ్య, ప్రసాదరావు ప్రథమ చికిత్స అందించి మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

నేడు బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని ఐటీ వరం గ్రామం ఆదివారం సాయంత్రం 6 గంటలకు పుల్లలచెరువు మండలం ఐటీ వరం గ్రామ పంచాయతీలో బాబు సూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని కావున ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఏరిక్షన్ బాబు హాజరవుతారు కావున పుల్లలచెరువు మండల తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ముఖ్య నాయకులు అందరూ పాల్గొనాలని పుల్లలచెరువు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పయ్యావుల ప్రసాద్ తెలియజేశారు.

ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని ఎల్ కోట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి, విద్యార్థినిలకు మరియు అంగన్వాడీ చిన్నారులకు శనివారం కంటి పరీక్షలను నిర్వహించడం జరిగింది. కంభం మండలంలోని ఎల్వి ప్రసాద్ కంటి పరీక్షా కేంద్రం విజన్ టెక్నీషియన్ ఇళ్లూరి.సుకుమార్ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలున్న చిన్నారులకు తదుపరి చికిత్సకై మండల కేంద్రంలోని ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి రావలసినదిగా కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వేణుగోపాలచారి, ఉపాధ్యాయుడు సాకం.కృష్ణ రంగారెడ్డి విద్యార్థులకు, కంటి ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను సూచిస్తూ, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల ఆరోగ్య సంక్షేమం పట్ల ఉపాధ్యాయులకు గల శ్రద్ధ నిబద్ధతలను పలువురు ప్రశంసించారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలలో విజయం సాధించిన విద్యార్థినిలకు సన్మానం

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఆడుదాం-ఆంధ్ర జిల్లా స్థాయి కబడ్డీ మహిళా పోటీలలో పాకల విద్యార్థినిలు విజేతగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆడుదాం- ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు ఒంగోలు మినీ స్టేడియంలో జనవరి 30నుండి 2 వరకు జరగగా కొండపి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పాకల మహిళల కబడ్డీ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది.ఎనిమిది నియోజకవర్గాల మధ్య జరిగిన రసవత్తమైన పోరులో పాకల విద్యార్థినిలు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లాలో ప్రథమ స్థానం వహించిన జట్టుకు మెడల్స్ ,60000 నగదు, సర్టిఫికెట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రథమస్థానం వహించిన జట్టు ఈనెల 9 నుండి 13 విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి హజరత్తయ్య తెలిపారు. జరిగిన సన్మాన సభలో విద్యార్థినిలను మరియు వ్యాయామ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సత్కరించారు. రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి పాకల గ్రామ పేరు ప్రతిష్టలను ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు.

రజక అభివృద్ధి సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని కొంగలవీడు రోడ్డులో గల మడియాల స్వామి గుడి ఆవరణలో రజక సేవా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులుగా కొమరోలు శ్రీనివాసులు, అలసందలపల్లె పాండు, రజక సంఘం అధ్యక్షులుగా పాలకవీటి బాల చెన్నయ్య, కార్యదర్శి సలిజామల పెద్ద కాదరయ్యని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణంలోని రజక సోదరులందరూ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పొన్నలూరు : ఆదివారం వైయస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ ఆవరణలో ఉదయం పది గంటలకు వైయస్సార్ ఆసరా అక్క చెల్లెమ్మలకు ఆర్థిక సహాయ చెక్కు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరవుతున్నారు. కావున మండలంలో ఉన్న అందరూ ఎంపీటీసీలు సర్పంచులు వార్డ్ నెంబర్లు మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది మండలంలో ఉన్నటువంటి డ్వాక్రా గ్రూప్ సభ్యులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ బాలకోటిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి తెలిపారు.

గిద్దలూరు అర్బన్ సీఐగా వీర సోమయ్య

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు అర్బన్ నూతన సిఐ వీర సోమయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన గుంటూరులో విధులు నిర్వహిస్తున్న వీర సోమయ్య బదిలీపై గిద్దలూరు అర్బన్ సిఐగా రావడం జరిగింది. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐ దేవప్రభాకర్ గుంటూరులోని లాలాపేటకు బదిలీ అయ్యారు. గిద్దలూరు పట్టణం పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తామని ఆయన తెలిపారు.

పట్టుదలతో శ్రమిస్తే ఫలితం సాధ్యం

విశాలాంధ్ర - చీరాల : సరైన ప్రణాళిక,పట్టుదలతో శ్రమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్సీ కే ఎస్.లక్ష్మణరావు అన్నారు. డిసెంబర్లో విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌కి నిరుద్యోగ అభ్యర్థుల నుంచి విశేషమైన స్పందన లభించిందని ఈనెల 25న ప్రిలిమ్స్ పరీక్ష జరగనున్నాయని ఈ పరీక్షకు లక్షల మంది అభ్యర్థులు పోటీపడుతున్న కొద్ది మంది మాత్రమే సరైన ప్రణాళికతో చదివి పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఉన్నారని అలాంటివారు కచ్చితంగా ఫలితాలు సాధిస్తారన్నారు. స్టేట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాయుడు రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత శిఖరాలు చేరుకునే విధంగా గతంలో అనేక సంవత్సరాలుగా శిక్షణను ఏర్పాటు చేసినట్లు దానికి కొనసాగింపుగా లుధరన్ జూనియర్ కళాశాల వారు గ్రూప్- 2 క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ పి.సునీత,ఆంధ్రప్రదేశ్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్ప రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోజ్,ఆర్య,డిబిఆర్పి కో-ఆర్డినేటర్ వి.భగవాన్‌దాస్ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ జానీ బాషా, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది గ్రూప్ - 2 అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆమాత్యుల మెప్పుకోసం అత్యుత్సాహం

విశాలాంధ్ర- టంగుటూరు: ఈ ఫోటోలలో కనిపిస్తున్నవారు జానపద కళాకారులో లేక కోలాటం కళాకారులో అంతకన్నా కాదు. వారు జగనన్న గోరుముద్ద తింటూ, జగన్ మామ ఇస్తున్న అమ్మఒడి పథకంతో, జగనన్న తలపెట్టిన నాడు నేడులో బాగుపడిన బడులలో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు. 4వ విడత వైయస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమానికి రాష్ట్రపురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ వస్తున్న నేపధ్యంలో, టంగుటూరుకు కొత్తగా బదిలీపై వచ్చిన ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం స్థానిక ఉన్నతపాఠశాలలో వేదికను ఏర్పాటుచేశారు. కల్చరల్ కార్యక్రమాలతో ఆమాత్యుల వారిముందు మెప్పుపొందాలని పాఠశాల విద్యార్థినీ విద్యార్థుల చేత కోలాట నృత్యంతో ఆహ్వానము, భరతవేదమున అనే సినిమా పాటలతో నృత్యం చేయించి అత్యుత్సాహం ప్రదర్శించాడు. ఊరికి కొత్త కాబోలు అందుకే కళాకారుల చిరునామా దొరకలేదో పాఠశాల విద్యార్థులతో నృత్యాలు చేయించాడు. అయినను ఆద్యంతం కార్యక్రమ నిర్వహణలోపం కనిపించింది, కార్యక్రమానికి వచ్చిన లబ్దిదారులందరూ మహిళలే వారికి కూర్చోవడానికి కుర్చీలను సైతం తగినన్ని ఏర్పాటుచేయలేదు, పాత్రికేయులను అయితే నిలువుకాళ్లమీదే నిలబోపెట్టారు.ప్రభుత్వ అధికారులను వేదిక మీదకు ఆహ్వానించడంలోను ఎంపిడిఓ సుబ్రహ్మణ్యం గందరగోళానికి గురయ్యారు. ప్రజాప్రతినిధులు ఒకరిద్దరు మాట్లాడే సమయానికి కరెంట్ కట్, దాదాపు కొన్ని నిమిషాలపాటు ప్రాంగణం గందరగోళం, విసుగుతో కార్యక్రమానికి వచ్చిన మహిళలు వెనుదిరిగారు. కార్యక్రమం ఏర్పాటుచేసిన అధికారుల మధ్య సమన్వయలోపం మంత్రి సమక్షంలోనే తేటతెల్లమయ్యింది, సమయం గడిచిపోవడంతో మిగిలిన ప్రజాప్రతినిధులు మాట్లాడకుండానే మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రసంగం మొదలు కాగానే మైక్ మొరాయించింది, దీంతో మంత్రి కొంత అసహనానికి గురయ్యారు. చేసేది ఏమిలేక మంత్రి ప్రచార రథం మైక్ సహాయంతో తన ప్రసంగాన్ని కొద్దిమాటలతోనే ముగించారు. సభాప్రాంగణం సగంపైగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. టంగుటూరు ఎంపిడిఓ తాను మంత్రిగారి ముందు మెప్పుపొందాలని తలస్తే తనకే ముప్పువాటిల్లింది.

క్రీడల్లో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవాలి

- కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలవాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడలను ప్రోత్సహించేందుకు యువతకు పెద్దపీట వేశారని కనిగిరి వైసీపీ ఇన్చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. శనివారం ఆడుదాం ఆంధ్ర జిల్లా క్రీడల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు కప్పు గెలిచిన ఖో ఖో జట్టు క్రీడాకారులకు ఎంపీడీవో కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఖో ఖోలో రాష్ట్రస్థాయి కప్పు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడి కాశి విశ్వనాథరెడ్డి, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, జడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వాయిస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, కంచర్ల వారి పల్లి సర్పంచ్ పోతూ రమణారెడ్డి, హనుమాన్‌రెడ్డి, రామణ తిరుపతిరెడ్డి,వైసీపీ నాయకులు మూలే గోపాల్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వీరం రెడ్డి, బ్రహ్మారెడ్డి, కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల పార్లమెంటు సీటు మాల సామాజికవర్గానికే కేటాయించాలి

- మాలమహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పార్లమెంటులో అత్యధిక ఓటర్లు ఉన్న మాల సామాజికవర్గం వారికే కేటాయించాలని మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు అన్నారు. శనివారం బాపట్ల మాల మహాసభ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఈ సందర్భంగా మల్లెల వెంకటరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బాపట్ల పార్లమెంటు సీటు అన్ని రాజకీయ పార్టీలు మాల అభ్యర్థులకే కేటాయించాలని మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. గత ఎన్నికలలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నందిగం సురేష్‌ను ఎంపీగా గెలిపించిన ఏనాడు ఎస్సీల సమస్యలపై ఆయన మాట్లాడలేదన్నారు. జిల్లాలో 10 లక్షల మంది మాలలు ఉంటే కేవలం లక్ష జనాభా కూడా లేని మాదిగలకు రాజకీయ పార్టీలు ఎంపీ సీటు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.బాపట్ల ఎంపీ సీటు మాదిగల ఇస్తే ఆ రాజకీయ పార్టీని రాష్ట్రవ్యాప్తంగా ఓడించి,మాలల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. రద్దు చేసిన ఎస్సీ,ఎస్టీ పథకాలు వెంటనే ప్రారంభించాలని బాపట్ల ఎంపీ సీటును అన్ని రాజకీయ పార్టీలు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 25న బాపట్ల క్రిస్టియన్ గ్రౌండ్స్‌లో మాలల ధూమ్ - ధామ్ సభకు పెద్ద ఎత్తున మాలలు తరలి రావలసిందిగా ఆహ్వానిస్తున్నామన్నారు. మాల నాయకులు చల్లపల్లి కోటేశ్వరరావు,గొర్రెముచ్చు వందనం పాల్గొన్నారు.

మద్యం ప్రియులకు శుభవార్త

- ఏపీలో మళ్లీ పాత బ్రాండ్ల మద్యం
- చంద్రబాబు అధికారంలోకి రాగానే చేస్తాను అన్నది జగన్ ముందే చేసేశారు.
- ఆనందం వ్యక్తం చేస్తున్న మందు బాబులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఏపీలో మందు బాబులకు గుడ్ న్యూస్. నాటి పాత బ్రాండ్ల మద్యం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ఏపీలో అందుబాటులో ఉన్న మద్యం బ్రాండ్ల పైన మందుబాబుల్లో వ్యతిరేకత కనిపించింది. రాజకీయంగానూ ఈ బ్రాండ్ల పైన విమర్శలు వచ్చాయి. అయితే, ఎన్నికల ముందు అనూహ్యంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో బార్లు, ప్రభుత్వ మద్యం షాపులకు అన్ని బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. పాత బ్రాండ్లు మళ్లీ రావడంతో మద్యం వ్యాపారం ఊపందుకుంటోంది.ఎన్నికల సమయంలో ఏపీలో మళ్లీ పాత బ్రాండ్ల మద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం బార్లు, మద్యం దుకాణాల్లో పాత బ్రాండ్ల అమ్మకాలు మొదలయ్యాయి. పాత బ్రాండ్లు తేవడంతో ఎన్నికల సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందని బార్ల యాజమాన్యాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే బార్లకు కావాల్సిన విధంగా బ్రాండ్లు సరఫరా చేస్తున్నారు. షాపులకు కూడా అన్ని బ్రాండ్ల మద్యం ఇస్తున్నా అన్ని షాపులకు ఇంకా పూర్తిస్థాయిలో చేరలేదు. ప్రభుత్వ నిర్ణయంతో బార్లలో వ్యాపారం కూడా కొంతమేర పెరిగింది. ప్రస్తుతం రోజుకు మొత్తం రూ.75కోట్ల మేర వ్యాపారం జరుగుతుండగా ఇకపై రోజుకు రూ.5 నుంచి రూ.10కోట్లు పెరిగే అవకాశం ఉంది.ఏపీలో దాదాపు నాలుగేళ్ల కాలంగా అమ్ముతం చేస్తున్న మద్యం బ్రాండ్ల గురించి ప్రతిపక్ష పార్టీల నేతలు విమర్శలు చేసారు. కొత్త పేర్లతో జరిగిన అమ్మకాల పైన మందుబాబుల్లో ఆగ్రహం వ్యక్తం అయింది. అయితే, ధరలు పెంచటం ద్వారా మద్యం ముట్టుకుంటే షాక్ కొట్టేలా చేయటమని ప్రభుత్వంలోని కొందరు నేతలు చెబుతూ వచ్చారు.ఇదే సమయంలో పాత బ్రాండ్ల స్థానంలో కొత్త పేర్లతో అమ్మకాలు జరిగాయి. కానీ, ఆ మద్యం పైన మందుబాబుల్లో మాత్రం వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. ఈ బ్రాండ్లు ఆరోగ్యం పైనా ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో, ఇప్పుడు పాపులర్ బ్రాండ్ల కంపెనీలతో తాజాగా చేసుకున్న ఒప్పందం ప్రకారం తిరిగి పాత బ్రాండ్ల మద్యం అందుబాటులోకి తెచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయం కావటంతో అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. అధికారంలోకి రాగానే పాత బ్రాండ్లను యధావిధిగా కొనసాగిస్తామని చంద్రబాబునాయుడు చేస్తున్న వాగ్దానానికి ముందుగానే స్పందించిన జగన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మద్యం బ్రాండ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంతమంది బాబులు తమ ఆనందాన్ని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభ పరీక్షను వినియోగించుకోండి

విశాలాంధ్ర - చీరాల : ఫిబ్రవరి 15 నిర్వహించే పదవ తరగతి ప్రతిభ పరీక్ష ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారని చీరాల వైస్సార్సీపి ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు.చీరాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టెన్త్ క్లాస్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ని కరణం వెంకటేష్ ఆవిష్కరించారు. కరణం వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ప్రతిభా పరీక్ష ద్వారా మొదటి నుంచి పది ర్యాంకులు సాధించినవారికి విలువైన బహుమతులు ఇవ్వబడతాయన్నారు. టెన్త్ క్లాస్ పరీక్షల్లో భయాన్ని పోగొట్టుకునేందుకు ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని విద్యార్థులు ఈ పరీక్షను వినియోగించుకోవలన్నారు.ఈ కార్యక్రమంలో రాయపాటి జగదీష్,దుడ్డు మార్కు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్థలాల బాధితులకు అండగా అఖిలపక్ష పార్టీల నాయకులు

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి సలాం సెంటర్, రామాలయం, రన్నింగ్ రూమ్, పోతురాజు గుడి, ముగ్గురోడ్డు, లంబాడ పేట ప్రాంతాల్లో రైల్వే స్థలాలలో నివాసం ఉండే పేదలకు సీపీఐ, సీపీఎం, వైసీపీ, టీడీపీ, జనసేన అఖిలపక్ష పార్టీలు అండగా నిలిచాయి. రైల్వే అధికారులు వస్తే ఎదుర్కో వటానికి తెల్ల వారుజాము 5 గంటలకు నుంచే వార్డులో అఖిలపక్ష పార్టీల నాయ కులు బాధిత ప్రాంత లలో పర్యటించారు. అఖిలపక్ష పార్టీల నాయ కులు మాట్లాడుతూ బాధితులకు ఇక్కడే ఉండే విధంగా రెగ్యులైజేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవ డానికి ప్రయత్నిస్తామన్నారు. ఇళ్ళు కూల్చివేతకు రైల్వే సిబ్బంది వస్తే కలిసికట్టుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమస్య పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామని అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీ నాయకులు ఈదులమూడి డేవిడ్ రాజు, కంచర్ల కాశయ్య, మున్నంగి వివేకానందరెడ్డి, తుడిమెల్ల వెంకటయ్య, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, ముదిగొండ ప్రకాష్, మేకా వెంకట్ రామిరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, కళ్ళం రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హత లేదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నమ్మి అధికారం అప్పగిస్తే తన 5 సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేయటంతో పాటు దళిత,బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఇటువంటి వారికి రానున్న ఎన్నికల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్థాపించిన పార్టీ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) ప్రత్యామ్నాయంగా నిలవబోతున్నామని రెండు తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి,జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి పాలను మించి పేదలకు అండగా ఉంటూ మంచి పరిపాలన చేస్తేఅని హామీ ఇవ్వటంతో గత ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియజేశామన్నారు.అధికారంలోకి వచ్చాక అందుకు భిన్నంగా పరిపాలన చేశారన్నారు.అంబేద్కర్ పార్టీ అయినా మా పార్టీ దళితులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు తమకు ముఖ్యం కాని ఈ ప్రభుత్వ హయాంలో దళిత మహిళలపై దాడులు,మానభంగాలు హత్యలు చేస్తున్నారన్నారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్లు చంపారని, వైసిపి ఎమ్మెల్సీ డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసినా ఈ సీఎం పక్కన పెట్టుకొని తిరుగుతున్నారన్నారు.నవరత్నాల పేరుతో భారత రాజ్యాంగం హక్కులను కాలరాస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు పేద పిల్లలకు అందకుండ చేశారన్నారు.మద్య నిషేధం చేసి ఆడపడుచులకు న్యాయం చేస్తా అన్నారు.అందుకు విరుద్దంగా తెలంగాణలో మద్యం బాటిల్ రూ.50 ఉంటే ఇక్కడ రూ.200 అమ్ముతున్నారన్నారు. అనాటి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తే నేడు సామాన్యుడి ఇల్లు కట్టుకోలేని పరిస్థితి లో ఉన్నాడని, ఇది రాక్షస ప్రభుత్వమని, రానున్న మా పేదల ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.అనంతరం పార్టీ జనరల్ సెక్రటరీగా షేక్ మస్తాన్ వలీ,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ షేక్ సుభాని, ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్‌గా ఎర్నేని కిరణ్‌ను నియమిస్తూ పత్రాలు అందజేశారు.

చేనేత భవన్ నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియో జకవర్గంలో పాత బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మాణం జరుగుతున్న చేనేతదారుల భవన్ ను శనివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమం తరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవి పరిశీలించారు. సుమారు రూ.5.50 కోట్లతో 5 అంతస్తుల మేర 40 షాపులు నిర్మాణం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవి, మంగళగిరి నియోజకవర్గంలో ప్రాచీనమైన చేనేత కలను ప్రోత్సహిస్తూ, చేనేత కార్మికులకు ఆసరాగా నిలుస్తూ ఈ భవనాన్ని నిర్మించుకోవడం జరిగిందని అన్నారు. ఇప్పటికే దాదాపు పూర్తయి పోయిన ఈ భవన నిర్మాణం చివరి దశలో ఉందని తెలిపారు. మరికొద్ది రోజుల్లోనే యుద్ధప్రాతి పదికన పూర్తిచేసుకుని చేనేత వస్త్ర విక్రయదా రులకు అంకితం చేయడం జరుగుతుందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి నేడు జగన్‌మోహన్ రెడ్డి పాలనలో చూస్తున్నా మన్నారు. నిర్మితమవుతున్న ఈ చేనేత భవన్ మంగళగిరి చేనేత ఉత్పత్తి దారుల కోసం మంగళగిరికే తలమానికం అని, మరికొద్ది రోజుల్లో అత్యాధునిక వసతులతో అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు.

చిన్నారులకు అన్నదానం

విశాలాంధ్ర-తాడేపల్లి : తెలుగు దేశం పార్టీ తాడేపల్లి మండల రూరల్ పార్టీ మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ జన్మదినం సందర్భంగా ఉండవల్లిలోని చిగురు అనాథ ఆశ్రమంలో యువ నాయకులు కొల్లి సురేష్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కొమ్మారెడ్డి కిరణ్‌కి పలువురు టీడీపీ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళ్ళం రాజశేఖర్ రెడ్డి, పఠాన్ కాశీం ఖాన్, దాసరి కృష్ణా, గుండిమెడ రమేష్ ఉన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ బీఎస్ ఎస్‌వీ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం 1262 డ్వాక్రా సంఘాలకు ఆసరా పథకం కింద రూ.10.79 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం ఆర్.సాంబశివరావు శనివారం తెలిపారు. కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రతిపాడు శాసనసభ్యులు, తాడి కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకతోటి సుచరిత, డీఆర్‌డీఏ పీడీ హాజరు కానున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఏపీఎం విజ్ఞప్తిచేశారు.

పట్టాదారు పాసుపుస్తకము సమర్పించాలనే నిబంధనను సడలించాలి

విశాలాంధ్ర-తెనాలి : మండల కేంద్రం దుగ్గిరాలలో దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత పసుపు కౌలు రైతులు శనివారం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ప్రకార్‌జైనుకు తమ విన్నపములను వివరించి మెమోరాండం సమర్పిం చారు. అగ్నిప్రమాదంలో పసుపు పంట అంతా బుగ్గిపాలై విచార గ్రస్తులుగా ఉన్నామని వివరించారు. ప్రభుత్వం సహాయం చేస్తుందని దుగ్గిరాలలో సబ్‌కలెక్టర్ సంబంధింత అధికారులు సహాయం చేస్తా మని చెప్పినందుకు అభినందనలు తెలియజేశారు. పాసుపుస్తకములు సమర్పించాలనే నిబంధనను పెట్టారని కానీ చాలా మంది కౌలు దారుల దగ్గర పట్టాదారు పాసుపుస్తకములు లేవని, కనీసం కౌలు కార్డులు కూడా లేవని విన్నవించుకున్నారు. వెంటనే సదరు నిబంధన లను సడలించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటి అధ్యక్షులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రైతు సంఘ నాయకులు కొల్లి రంగారెడ్డి, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

కాలనీకి మహర్దశ

విశాలాంధ్ర-తాడికొండ : స్థానిక మండల పరిషత్ కార్యాల యం ఎదురుగా ఉన్న కాలనీకి మహర్దశ పట్టింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే డొక్కా మాణిక్య వరప్రసాద్ 60 మందికిపైగా బీసీ, ఎస్సీలలో నిరు పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. అయితే సరైన మౌలిక వసతులు లేకపో వడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. రాజధాని పుణ్యమా అంటూ 2014 నుంచి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తాత్కాలి కంగా కరెంటు రహదారులు ఏర్పడ్డాయి. ఇల్లు నిర్మించుకున్న మౌలిక వసతులు లేకపోవడంతో కాలనీవాసులు అసౌకర్యానికి గురవుతు న్నారు. జనవరి 30న ప్రత్తిపాడు శాసనసభ్యులు తాడికొండ నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ మేకతోటి సుచరిత కాలనీని సందర్శించారు. కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరు పెట్టారు. శనివారం సర్పంచి తోకల సరోజినీ నరసింహారావు మండల ఉపాధ్యక్షులు రెడ్డి త్రివేణి, పలువురు వార్డు మెంబర్లు నాయకులు కాలనీ సందర్శించి పనులను ప్రారంభించారు. కాలనీలో రహదారులు సైడ్ డ్రమ్స్, వీధిలైట్లు, ట్రాన్స్ ఫార్మర్, మంచినీటి కుళాయిలు, గ్రీనరీ రానుంది.

రాష్ట్ర భవిష్యత్తును సర్వనాశనం చేసిన జగన్ రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును జగన్ రెడ్డి సర్వనాశనం చేశాడని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు. శనివారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. జగన్ రెడ్డి చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధం అయ్యారని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

విశాలాంధ్ర-దర్శి : నియోజకవర్గం అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి అసెంబ్లీ నియోజకవర్గ ఇందార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయములో నియోజకవర్గ జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన సర్పంచ్‌లు, యం.పి.టి.సి లు తమ తమ గ్రామాల్లో సమస్యలపై జరగాల్సిన పెండింగ్ పనులపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివ ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు ప్రత్యేక వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో త్రాగు నీరు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పలు కారణాల వలన ఆగిపోయిన పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్‌లు, యం.పి.టి.సి లు కోరన పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దర్శి పట్టణంలో ఇంటింటికీ కుళాయి పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. గంగవరం-తాళ్ళూరు రోడ్డు పనులు, కురిచేడు- పొట్లపాడు ఆర్ అండ్ బి రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎస్సీ, బి.సి., కాలనీలలో విద్యుత్ పోల్స్ అవసరం అయితే జెడీ నిధులతో మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన ప్రతి పనిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పెండింగ్ లేకుండా చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసి కాలనీలలో వోల్టేజ్ సమస్యలు ఉన్న చోట విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్, ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్లు వేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీలలో తమ సొంత ప్లాట్లలో ప్రభుత్వం అందిస్తున్న నివాసాలు ఏర్పాటు చేసుకునే వారికి అధికారులు తమకు కావాల్సిన ఇసుక, సిమెంట్ వంటి మెటీరియల్‌లు, వారికి చెల్లిందాల్సిన బిల్లుల్లో లోపాలు అధికమించి నివాసాలు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరాడు. ఆర్. డబ్ల్యుయస్ ఎస్ఇ మర్దాన్లీ, ఇఇ శ్రీనివాస రావు, డిఇ రంగారావు ఆర్ అండ్ బి డిఇ కృష్ణ, పంచాయతి రాజ్ డిఇ విటల్ రాథోడ్, విద్యుత్ ఇఇ షేక్ కరీమ్ డిఇ పిచ్చయ్య. ఎంపీపీ సుధా అచ్చమ్మ, పిక్ కార్పోరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం బాషా, వైస్ ఎంపీపీలు లు కొరివి ముసలయ్య, సోము దుర్గారెడ్డి, ఎంపీడీవో హనుమంత రావు, సర్పంచుల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నాడు.

ఎన్నికల నిర్వహణకు మానవ వనరులు సమకూర్చుకోవాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మానవ వనరులు అధికారులు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు.ఎన్నికల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధి నిర్వహణలో అధికారులకు నిర్లిప్తత ఉండరాదని హెచ్చరించారు.ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాల్సి ఉందని స్పష్టం చేశారు.సొంత నిర్ణయాలు ఏమాత్రం ఉండరాదన్నారు.ఎన్నికల విధి నిర్వహణలో అధికారులు తక్షణమే స్పందించాలని ఆయన ఆదేశించారు.ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి ఉద్యోగులను ఆయా ప్రాంతాలలో నియమించాల్సి ఉందన్నారు. జిల్లా అధికారుల అనుమతి లేకుండా ఏ హోదాలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈఎల్స్ ఇవ్వరాదన్నారు. ముఖ్యంగా సచివాలయాల సిబ్బందికి మూడు నెలల పాటు ఈయల్స్ తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు.ప్రభుత్వ గెజిటెడ్ అధికారులు,నాన్ గెజిటెడ్ అధికారులు,ఆఫీస్ సబార్డినేటర్లు,కాంట్రాక్ట్ ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు వేరువేరుగా ప్రతి శాఖ జిల్లా అధికారులు స్పష్టంగా నివేదిక నివ్వాలని ఆయన ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సి హెచ్ శ్రీధర్, జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆమంచి రౌడీయిజం,అరాచకాలు సాగనివ్వం

- గ్రానైట్ దందాకు అధిపతి 'ఆమంచి'
- ప్రవేట్ సైన్యంతో దోపిడీ చేస్తుంది నిజం కాదా
- బొగ్గు అమ్మిన స్థాయిని మరిచిపోకు
- దమ్ముంటే అభివృద్ధిలో పోటీపడు...
- సత్తా ఉంటే ఎమ్మెల్యే ఏలూరిని రాజకీయంగా ఎదుర్కోవాలి
- మీడియాతో టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - మార్టూరు : ఆమంచి కృష్ణ మోహన్ అరాచకాలు రౌడీయిజం ఇక సాగవని, ప్రశాంతంగా ఉన్న పర్చూరు నియోజక వర్గంలో అలజడి సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, మార్టూరు పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్ధన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి రజాక్, వైస్ ఎంపీపీ దాసం అశోక్, శివలు హెచ్చరించారు. శనివారం మార్టూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు గ్రానైట్ పరిశ్రమలు వైసీపీ రౌడీ మూకలతో మైనింగ్ అధికారులు దాడులు చేసి అక్రమ కేసులు నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజా నాయకుడు ఎమ్మెల్యే ఏలూరిపై రాజకీయంగా గెలవలేమనే భయంతో ఆమంచి కృష్ణమోహన్ రౌడీ రాజకీయానికి తెర తీసాడని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఏలూరికి సంబంధంలేని విషయంలో కేసులు పెట్టి రాజకీయంగా ఇబ్బందులు గురిచేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఆమంచికి దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడాలి తప్ప ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాజకీయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.ఎమ్మెల్యే ఏలూరి కష్టపడి ఉద్యోగం చేసి తన తెలివితేటలతో కంపెనీని ప్రారంభించి రైతన్నలకు సేవలు అందిస్తూ ప్రజల ఆశీస్సులతో రాజకీయాలకు వచ్చారని గుర్తుచేశారు. సమావేశంలో మిన్న కంటి రవి, అడుసుమల్లి శ్రీనివాసరావు, మక్కెన శేఖర్ బాబు, మస్తాన్వలి, మార్టూరు మండల మహిళా అధ్యక్షురాలు రమాదేవి ఉన్నారు.

సిమెంటు రోడ్లు ప్రారంభించిన ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని కొత్తపట్నం రోడ్డు లోని ముస్లిం బరియల్ గ్రౌండ్స్‌లో యం.పి లాడ్స్‌తో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాఢ సుజాత, కార్పొరేటర్ పసుపులేటి శ్రీను, జిలాని,మాబు,షైక్ ఆన్సర్,అమీద్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని ఆసోదివారిపాలెం పంచాయతీ పోతురాజుకొత్తపాలెం గ్రామానికి చెందిన 32 మంది వైసీపీ కార్యకర్తలు పార్టీ మాజీ మండల అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ చేతుల మీదుగా తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలోకి చేరారు.ఈ సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. చంద్రబాబు సీఎంగా చేసుకుని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి అవినీతి లేని పాలన చేసుకుందామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముక్కముల సాంబశివరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దేవాంగపురి జట్టు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో దేవాంగపురి సచివాలయం జట్టు సత్తా చాటింది. బాపట్ల జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో బాలుర విభాగంలో దేవాంగపురి సచివాలయం జట్టు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. దీనితో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాబడ్డారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ఎంపీడీఓ శోభారాణి, దేవాంగపురి పంచాయితీ సెక్రటరీ బండారు మురళీ బాపూజీ, సిబ్బంది తదితరులు అభినందించారు.

పింఛనుదారులకు ఎమ్మెల్యే కోన దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : కోన చారిటబుట్ ట్రస్టు ఆద్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ఫించన్ దారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలం లోని అసోదివారి పాలెం గ్రామంలో శనివారం దుప్పట్ల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసమే కోన చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి గత మూడు దశాబ్ధాలుగా సేవా కార్యక్రమాలు చేపడు తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.